www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 21 అక్టోబర్ 2023
5
తిరుపతి

స్విమ్స్‌ను సందర్శించిన డబ్ల్యుహెచ్‌ఒ ప్రతినిధి

తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) మైక్రోబయాలజీ విభాగాన్ని శుక్రవారం ఉదయం ప్రపంచ ఆరోగ్య సంస్థ వారు సందర్శించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ మైక్రోబయాలజీ ల్యాబ్‌ను కమీషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ టీం జె.నివాస్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ డి. మోహన కృష్ణ, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ అనూజ్ శర్మ, స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి. కుమార్ స్విమ్స్ మైక్రోబయాలజీ విభాగాన్ని పరిశీలించారు. స్విమ్స్ ను యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ నియంత్రణ కోసం స్టేట్ రిఫరెన్స్ ల్యాబ్ గా ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణ, ప్రొఫెసర్ డాక్టర్లు ఉషశ్రీ పాల్గొన్నారు.

'ఎస్...ఒపిఎస్' అనాల్సిందే..!

- యుటిఎఫ్ నిరసనల హోరు
- చిత్తూరులో నిరవధిక దీక్ష భగ్నం

చిత్తూరులో దీక్ష భగ్నం చేసి అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, చిత్తూరు అర్బన్, యంత్రాంగం

పాత పెన్షన్ సాధించేవరకూ పోరాటం ఆగదని, సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. ఒపిఎస్ పునరుద్ధరణ కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. చిత్తూరులో నిరవధిక దీక్షను పోలీసులు భగ్నం చేసి నేతలను స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం ఎంత నిర్బంధం కొనసాగించినా ఒపిఎస్ సాధించేవరకూ పోరాడతామని జిల్లావ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగాయి. చిత్తూరు జిల్లాలో ఎంపిడిఓ, నగరి కేంద్రంగా దీక్షలు నిర్వహించారు.

చిత్తూరు అర్బన్ : సిపిఎస్ మాకొద్దు.. ఒపిఎస్ కావాలి' అంటూ చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం చేపట్టిన నిరవధిక దీక్షను శుక్రవారం పోలీసులు భగ్నం చేశారు. యుటిఎఫ్ నాయకులు రాత్రుల్లో సైతం దీక్షా శిబిరంలోనే నిరసన కొనసాగించారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు వన్‌టౌన్ ఎస్ఐ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో దీక్షా శిబిరం వద్దకు వచ్చి యుటిఎఫ్ నాయకులు రఘుపతిరెడ్డి, జీవి రమణ, సుధాకర్‌రెడ్డి, సోమశేఖర్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు, దక్షిణామూర్తి, ఎంవి రమణ, పార్థసారథినాయుడులను బలవంతంగా నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. నాయకులను అరెస్టు చేసి పోలీసు వాహనాల్లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ తీరుపై యుటిఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆస్పత్రిలో నాయకులను పరీక్షించిన వైద్యులు నేతలకు బీపీ, సుగర్ లెవల్స్ తగ్గాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ భరోసా కోసం యుటిఎఫ్ చేసిన నిరవధిక దీక్షలకు ఎపిటిఎఫ్ 1930 జిల్లా నాయకత్వం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శాంతి యుతంగా హక్కుల సాధనకోసం అమరణ నిరాహార దీక్షలు పూనుకున్న తమపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల ద్వారా దీక్షలను భగ్నం చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, జీవి రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

తిరుపతి టౌన్‌లో... యుటిఎఫ్ కార్యాలయంలో పాత పెన్షన్ సాధనకై గురువారం ప్రారంభమైన నిరాహారదీక్ష శుక్రవారం రెండో రోజు కొనసాగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.నిర్మల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒపిఎస్ స్థానంలో జిపిఎస్ అమలు చేస్తామని ఏకపక్ష ధోరణితో ముందుకెళుతోందని, ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోవడం మాట తప్పడమేనని అన్నారు. 2003 డిఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలికంగా నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య, సిపిఎస్ సబ్‌కమిటీ జిల్లా కో కన్వీనర్ ఆర్.నాగరాజు పాల్గొన్నారు.

గూడూరులో... పాత బస్టాండ్ సమీపంలో విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు సిపిఎం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, ఎల్ఐసి అసోసియేషన్ నాయకులు విజయ్‌కుమార్, శివకుమార్ సంఘీభావం ప్రకటించారు. యుటిఎఫ్ నాయకులు రవి, మురళీసింగ్, శివకళ, నాగేశ్వరరావు, పానేష్, గురునాధం పాల్గొన్నారు.

తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం నేతలు

సూళ్లూరుపేటలో... సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ యుటిఎఫ్ మండల శాఖల ఆధ్వర్యంలో సూళ్లూరుపేట సిఐటియు ఆఫీసులో నిరవధిక దీక్ష చేపట్టారు. పూర్వపు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెంగని చంద్రశేఖర్, తిరుపతి జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్ ప్రారంభించారు. ఈ దీక్షల్లో కావూరు ప్రభాకర్, ఎస్.బాబు, కొప్పోలు అరుణకుమారి, ఎ.గోవర్ధన్, ఎన్.రవికుమార్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో... వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల యుటిఎఫ్ కార్యకర్తలు నిరవధిక దీక్షలో పాల్గొన్నారు. ఎవరైతే ఒపిఎస్ అమలు చేస్తారో వారికే తమ ఓటని నేతలు హెచ్చరించారు. దీక్షల్లో జిల్లా కార్యదర్శి ఎం.కుమారస్వామి, రాష్ట్ర కౌన్సిలర్ కె.ఉదయ్‌కుమార్, మాజీ జిల్లా కార్యదర్శి ఈ.వేణుగోపాల్, కె.ఆదినారాయణ, సాకి, శ్రీహరి, ఎం.చలపతి, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు వడ్డిపల్లి చెంగయ్య సంఘీభావం ప్రకటించారు.

నాయుడుపేటలో... సిఐటియు కార్యాలయంలో దీక్ష చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.రామ్మూర్తిరాజు, మాజీ జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ప్రసంగించారు. సిఐటియు నాయకులు ముకుంద, వెంకటేశ్వర్లు సంఘీభావం ప్రకటించారు. ఈ దీక్షలో కె.సుబ్బారావు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, స్నేహలత, కల్పన, జ్యోతి పాల్గొన్నారు.

నాయుడుపేటలో...

వెంకటగిరిలో..

సరుకు (రక్త) హీనత..!

- పాల ప్యాకెట్లు గబ్బుగబ్బు
- కోడిగుడ్లు సైజ్ గోళీలంత
- వేరుశనగ చిక్కీల్లో పురుగులు
- అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం నిల్
- కాంట్రాక్టర్ల తీరుపై తీవ్ర విమర్శలు

నాశిరకం పోషకాహార కిట్

బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆశయం కాంట్రాక్టర్ల నిర్వాకంతో నీరుగారిపోతోంది. మెరుగైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామంటూ బుకాయిస్తూనే ఏమాత్రం నాణ్యతలేని రేషన్‌బియ్యం, పామోలిన్, వాసనవస్తున్న పాలప్యాకెట్లు, చిన్నసైజు కోడిగుడ్లతోనే, పురుగులు పట్టిన చిక్కీలతోనే సరిపెడుతున్నారు. ఇటీవల నిర్వహించిన ఆరోగ్య సర్వేల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 21 అంగన్‌వాడీ ప్రాజెక్టుల్లో 4100, తిరుపతి జిల్లాలలోని 2753 ఐసిడిఎస్ కేంద్రాల పరిధిలోని 70 శాతం మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు అధికారిక లెక్కలు. అయితే కలెక్టర్, డిఎంహెచ్ఒ, ఐసిడిఎస్ అధికారులు సైతం సమీక్షలతోనే సరిపెడుతున్నారు తప్ప పౌష్టికాహారం లబ్ధిదారులకు నాణ్యతగా చేరుతుందా? లేదా? కాంట్రాక్టర్లు అందిస్తున్న ఆహారంపై దృష్టి పెట్టకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఫలితంగా అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలను, బాలింతలను, గర్భిణులను రక్తహీనత వెంటాడుతూనే ఉంది. (ప్రజాశక్తి- తిరుపతి)

అందని 'సంపూర్ణ పోషణ'

గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తోంది. కిలో రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరుశనగ చిక్కి, కిలో జొన్నపిండి, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఎండు ఖర్జూరం, 3 కిలోల ఫోర్టిఫైడ్ రైస్, అరకిలో నూనె, అరకిలో పప్పు, 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లతో కూడిన కిట్టులను అందజేస్తోంది. వీటన్నింటినీ డ్రైరేషన్‌గా లబ్ధిదారులకు అందిస్తున్నామని అటు అధికారులు, ప్రభుత్వం, ఇటు కాంట్రాక్టర్లు బుకాయిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం దీనికి పూర్తి భిన్నంగా లబ్ధిదారులకు చేరుతుండటం గమనార్హం.

పిల్లల ఆరోగ్యం పైనా దృష్టేదీ !

ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సుగల పిల్లలకు నెలకు రెండున్నర కిలోల బాలామతం, రెండున్నర లీటర్ల పాలు, 25 కోడిగుడ్లను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సమకూర్చుతోంది. మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహరాన్ని వంటచేసి పిల్లలకు వడ్డిస్తోంది. చిన్న పిల్లలకు సోమవారం, గురువారాల్లో పౌష్టికా హారం, కూరగాయల కూర, సాంబారు, కోడిగుడ్డు కూర, వంద లీటర్లపాలు, మంగళవారం, శుక్రవారా ల్లో పౌష్టికాహారం, పప్పు, తోటకూర, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలు, బుధ, శనివారాల్లో పౌష్టికాహారం, వెజిటబుల్ రైస్, పులిహోరా, గోంగూర కూర, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలుతో కూడిన మెనూను అమలు చేస్తోంది. అయితే ఈ సరుకుల సరఫరాలో కాంట్రాక్టర్ల చేతివాటంతో నాణ్యమైన సరుకులు అందక పిల్లలకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందించలేక వంటమ్మలు , అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటం శోచనీయం. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక విద్యాకేంద్రాల్లోని పిల్లల్లోనూ దాదాపు 15 వేల మందికిపైగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అటు ప్రభుత్వం, ఇటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తూతూ మంత్రంగా సర్వేలు చేసి కంటితుడుపు చర్యలు తీసుకుంటున్నారే తప్ప అవసరమైన పౌష్టికాహారాన్ని పూర్తిగా అందించలేకపోతున్నారని ప్రజాసంఘాలు వాపోతుండటం గమనార్హం. వైద్యరంగంలో రాయలసీమకే తలమానికంగా నిలుస్తున్న తిరుపతిలోని ప్రభుత్వ మెటర్నటీ చిన్నపిల్లల ఆస్పత్రికి వస్తున్న ప్రతి 100 మంది మహిళలు, చిన్నారుల్లో దాదాపు 70 నుంచి 80 శాతం మంది మహిళల్లో రక్తహీనత తలెత్తుతోందని, ప్రసవం సమయంలో అవసరానికి సరిపడా రక్తమూ దొరకడం లేదని సాక్షాత్తూ అక్కడి వైద్యులు చెబుతుండటం శోచనీయం. దీంతో రక్తం కోసం తిరుపతి రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, వివి మహల్ రోడ్డులోని ప్రైవేటు బ్లడ్‌బ్యాంకుల నుంచి ప్రతిరోజూ 150 నుంచి 200 యూనిట్లు వరకు తీసుకెళుతుండటం గమనార్హం.

కాంట్రాక్టర్లు నాణ్యతతో ఇవ్వాలి : వాణిశ్రీ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి

బాలింతలు, గర్భిణీలు, పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పూర్తిస్థాయిలో లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అటు ప్రభుత్వం, ఇటు అధికారులదే. అయితే కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్న సరుకుల నాణ్యతాలోపంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. నాణ్యత తలెత్తినప్పుడల్లా తరచూ అంగన్‌వాడీలనే నిందిస్తున్నారు తప్ప వాస్తవాలను గ్రహించడం లేదు. ఇప్పటికైనా మెరుగైన సరుకులను అందించాలి.

నేడు రాష్ట్ర గవర్నర్ తిరుమలకు రాక

తిరుపతి టౌన్ : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని, రోడ్డుమార్గాన తిరుమల వెళ్లి రాత్రి బస చేస్తారు. ఈ నెల 22న ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం 12.50 గంటలకు రేణిగుంట చేరుకొని బెంగళూరు వెళ్లనున్నారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలియజేసారు.

ఆరోగ్యం... ఆర్భాటం..!

- తూతూమంత్రంగా ఆరోగ్యసురక్ష శిబిరాలు
- మందులు, పరీక్షలు, పరికరాలు ఉత్తిదే..

వైద్యశిబిరంలో ఇచ్చిన స్లిప్పులతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి వచ్చిన రోగులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అంటూ వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఒక్క రూపాయి ఖర్చు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. శిబిరాల్లో ఎక్కడా స్పెషలిస్టు డాక్టర్లు కానరావడం లేదనీ, అరకొర పరీక్షలు, మందులు, పరీక్షలతోటే సరిపెట్టేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైద్య సేవలు పొందేందుకు వచ్చేవారిని కూర్చోబెట్టి, గంటల తరబడి సమావేశాలు నిర్వహించి, కొంతమందికి సీఎం ఫొటో ముద్రించి ఉన్న సంచులు (కిట్లు) ఇస్తున్నారే తప్ప పూర్తిస్థాయి పరీక్షలు చేసి, మందులు ఇవ్వడం లేదంటూ కొందరు రోగులు పెదవి విరుస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసుకుని ఉన్నత వైద్యం కోసం పెద్దాస్పత్రులకు రెఫర్ అయిన రోగులకు అక్కడ కూడా అరకొర వైద్యమే అందుతుండటం విచారకరం. ఇటీవల శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయిలో నిర్వహించిన శిబిరాల నుంచి రెఫర్ అయిన సుమారు వెయ్యికి పైగా రోగులు శుక్రవారం శ్రీకాళహస్తికి రాగా వీరికి అందుబాటులో లేని వైద్యులు, అరకొర పరీక్షలు, మందులే దర్శనమివ్వడం ఇందుకు నిదర్శనం.

రోగాలను ముందస్తుగా గుర్తించి వాటిని తక్కువ ఖర్చుతోనే నయం చేసేలా వైసీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలోని 15,005 సచివాలయాల ద్వారా 1.67 కోట్ల పేద కుటుంబాలకు పైసా ఖర్చు లేకుండా వ్యాధులను గుర్తించి నయం చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే జగనన్న సురక్ష శిబిరాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. శిబిరాల వద్ద 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు, అనుభవజ్ఞులైన స్పెషలిస్టు వైద్యులను అందుబాటులో ఉంచాల్సి ఉండగా, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

జగనన్నకు చెప్పుకోండి!

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో గత నెల రోజులుగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శరవేగంగా జరుగుతున్నాయి. వాలంటీర్లు, వైద్య సిబ్బంది గుర్తించిన రోగులు ఈ శిబిరాలకు టోకెన్లతోటి హాజరవుతున్నారు. అయితే శిబిరాల వద్ద అర్బన్, మండల స్థాయిలో పనిచేసే వైద్యులు మాత్రమే అందుబాటులో ఉండడంతో స్పెషలిస్టుల కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వెయ్యికి పైగా రెఫర్ రోగులు పెద్ద ఎత్తున ఏరియా ఆసుపత్రికి రాగా అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమందిని తూతూమంత్రంగా పరీక్షించి పంపేయడంతో రోగులు వైద్యుల తీరుపై మండిపడ్డారు. ఈ మాత్రం దానికి మాకు టోకెన్లు, వారం రోజుల నిరీక్షణ, వ్యయ, ప్రయాసలు అవసరమా అంటూ నిలదీశారు. పైగా ఆరోగ్యశ్రీ లో చికిత్స చేసుకోండి అంటూ ప్రయివేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే జగనన్నకు చెప్పుకోండని ఉచిత సలహా ఇచ్చారంటూ మండిపడ్డారు. ఈ విషయంపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మిని వివరణ కోరగా శుక్రవారం 50 మంది రెఫర్ రోగులు మాత్రమే వచ్చారనీ, అందరికీ పరీక్షలు చేసి, మందులిచ్చి పంపినట్లు తెలిపారు. ఒక్కర్ని మాత్రమే అడ్మిషన్ లో ఉంచామని చెప్పడం గమనార్హం.

పరీక్షలే చేయలేదు: పెద్ద గున్నయ్య, రోగి

నాకు వినికిడి సమస్య ఉంది. మా వాలంటీర్, నర్సు చెబితే శిబిరానికి వెళ్ళా. స్పెషలిస్ట్ డాక్టర్ లేకపోవడంతో పెద్దాస్పత్రికి పొమ్మన్నారు. తీరా ఇక్కడికొస్తే పరీక్షలే చేయకుండా పంపారు. వినికిడి యంత్రం అడిగితే జగనన్నకు చెప్పమని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

రక్తం కొనుక్కోమన్నారు: వెంకట్రామయ్య రోగి

మా ఊర్లో నిర్వహించిన శిబిరంలో నాకు రక్త పరీక్షలు చేసి రక్తం 3 శాతమే ఉందని చెప్పారు. వెంటనే రక్తం ఎక్కించుకోమని పెద్దాస్పత్రికి పొమ్మన్నారు. తీరా ఇక్కడకు వస్తే నువ్వే రక్తం తెచ్చుకో, అప్పుడు మేం ఎక్కిస్తామని సెలవిచ్చారు.

ఆర్ఎస్ బ్రదర్స్ వార్షికోత్సవంలో హీరోయిన్ అనుపమ

ఆర్ఎస్ బ్రదర్స్‌లో దసరా ఆఫర్లు

వార్షికోత్సవ వేడుకల్లో హీరోయిన్ అనుపమ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి నగరంలోని ఆర్ఎస్ బ్రదర్స్ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ దసరా ఆఫర్లను ప్రకటించారు. షోరూమ్ వద్దకు చేరుకున్న ఆమెకు అభిమానులు, ఆ సంస్థ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. షోరూమ్ మొత్తం కలయ తిరిగి అక్కడ ఏర్పాటు చేసిన నూతన వస్త్రాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాలమైన ప్రాంతంలో తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో అతి పెద్ద వస్త్ర షోరూంను ఆర్ఎస్ బ్రదర్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ నుంచి రామానుజన్ సర్కిల్ వరకు కొత్త రోడ్డు కూడా అందుబాటులో ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా లేవన్నారు. ఆర్ఎస్ బ్రదర్స్ కు విశాలమైన పార్కింగ్ సదుపాయం ఉన్నందున కొనుగోలుదారులకు ఎలాంటి సమస్యలూ ఉండవన్నారు. ఈ అవకాశాన్ని వస్త్రప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ సంస్థ యాజమాన్యం మాట్లాడుతూ తమ షో రూమ్ లో సారీస్ వేర్ మెన్స్ వేర్ లేడీస్ వెస్ట్రన్ వేర్ కిడ్స్ వేర్ చుడిదార్ లెహంగా లెగ్గింగ్స్ గౌన్లు బ్రాండ్ లేడీస్ వేర్ లో లేటెస్ట్ ట్రెండుకి అనుగుణమైన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. దసరా సందర్భంగా వెయ్యి రూపాయలు విలువ చేసే ప్రతి కొనుగోలు పై స్పాట్ గిఫ్ట్ అందిస్తున్నామన్నారు. ఎస్బిఐ కార్డు పై ఐదు శాతం క్యాష్ బ్యాక్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆకర్షణ నిమిత్తం వస్త్రాలు అతి తక్కువ ధరలకు ప్రత్యేక ఆఫర్లతో అందిస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ క్లస్టర్ మేనేజర్ నవీన్ కుమార్, నరసింహ, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం, సికేఎస్ తేజ ఇన్స్ స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ అండ్ రిసర్చ్ సంయుక్తంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత దంత వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, హెచ్ఓడి ఆఫ్ పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ డాక్టర్ శిరీషరావుతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నిత్యజీవితంలో దంత సంరక్షణ అనేది చాలా ప్రధానమైన అంశమని, మనిషి చిరునవ్వులో దంతాలకు ప్రత్యేక ఆకర్షణ కలిగి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దంత సంరక్షణ నియమాలను పాటించి పటిష్ట దంతాలను కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు సుజన్ కుమార్, చంద్రయ్య, నరేన్ కుమార్ పాల్గొన్నారు.

మహిళా హక్కులపై అవగాహన అవసరం

క్యాంపస్ : సమాజంలో మానవహక్కుల గురించి ముఖ్యంగా మహిళల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పాస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మంజుల అన్నారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం, పాస్ ఎన్జీవో, ఆకాంక్ష స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా 'మానవ హక్కులు.. మహిళా హక్కులు' అంశంపై చిన్నగుంటలోని పద్మావతి మహిళా సమాఖ్య క్లస్టర్ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మంజుల మాట్లాడుతూ సమాజంలో మహిళలు నిస్సహాయ స్థితిలో ఉండి వారి హక్కుల విషయంలో సమాజ నిర్లిప్తతకు గురవుతున్నారన్నారు. పని ప్రదేశాల్లో వేధింపులకు గురవుతున్నారన్నారు. సీనియర్ అడ్వకేట్ ఎస్.వసుమతి మాట్లాడుతూ మహిళలకు జీవించే హక్కు ఉన్నా, భ్రూణ హత్యల రూపంలో ఆ హక్కుని ఈ ఆధునిక సమాజంలో కాలరాస్తున్నారన్నారు. వారసత్వంలో సమాన వాటా హక్కు, గృహహింస నిరోధక హక్కు, సమాన పనికి సమాన వేతన హక్కు, గోప్యత పాటించే హక్కు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆకాంక్ష సంస్థ ప్రతినిధి రవిబాబు, మహిళా అధ్యయనకేంద్రం అధ్యాపకులు రమణ, శ్రీలత కిషోరి, సునీత పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ చర్యకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - తిరుమల

బిజెపి విశ్వహిందూ పరిషత్ లాంటి అభివద్ధి నిరోధక సంస్థల ఒత్తిడికి లొంగి రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి మున్సిపాలిటీకి టిటిడి చెల్లించాలనుకున్న ఒక్క శాతం నిధులను తిరస్కరించడంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తీవ్రంగా మండిపడ్డారు. టీటీడీ లాంటి ధార్మిక సంస్థ తిరుపతి అభివద్ధికి తోడ్పడడం అనివార్యమైన చర్యగా తాము భావిస్తున్నామని నాగరాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటినుంచి తిరుపతి అభివద్ధి పట్ల వ్యతిరేకంగాను, అభివద్ధి నిరోధకంగాను వ్యవహరిస్తున్న విశ్వహిందూ పరిషత్, బిజెపి, ఆర్ఎస్ఎస్ లాంటి శక్తుల వత్తిడికి లొంగిపోయి రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడడం తిరుపతి ప్రజల మనోభావాలను వ్యతిరేకించడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

1శాతం రద్దుచేస్తూ ఉత్తర్వులు

తిరుపతి అభివద్ధికి టిటిడి బోర్డు తీర్మానించి కేటాయించిన 1శాతం నిధులు విడుదల నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాళ్ళ వల్లవన్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బోర్డు తీర్మానం రోజు కరికాళ్ళ వల్లవన్ సమావేశంలో ఉన్నా, ఆరోజు ఆమోదం తెలిపి తిరిగి రద్దు చేయడం వెనుక అంతర్యం ఏమిటనే సందేహం ప్రజల్లో వినిపిస్తుంది. బోర్డు తీర్మానం తో ప్రజల నుండి హర్షాతిరేకాలు వినపడ్డాయి. తిరిగి రద్దు చేయడం వెనుక బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల కుట్ర దాగుందని ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

హ్యాపీ మొబైల్స్ కొనుగోళ్లపై ప్రత్యేక ఆఫర్లు : ఎమ్‌డి కృష్ణ పవన్ పిలుపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్థానిక అన్నమయ్య సర్కిల్ ఎయిర్ బైపాస్ రోడ్ లో నూతనంగా ప్రారంభించిన రెండవ బ్రాంచ్ హ్యాపీ మొబైల్స్ లో కస్టమర్ల ప్రతి మొబైల్ కొనుగోలుపై దసరా ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు హ్యాపీ మొబైల్స్ చైర్మన్ అండ్ ఎండి కృష్ణ పవన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రైవేట్ హొటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెయ్యి రూపాయల హ్యాపీ మొబైల్స్ కొనుగోళ్లపై అద్భుతమైన బహుమతులు ఎల్ఈడి టీవీలు, ట్రావెల్ సూట్ కేసులు ప్రత్యేక డిస్కౌంట్లు ఆఫర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కొన్ని మొబైల్స్ పై 65 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు చెప్పారు. హ్యాపీ మొబైల్ షోరూం లో దాదాపు 300 లకు పైగా మోడల్స్ 500 రకాల యాక్షసరీలు పేరుకు తగ్గట్లు ఉంచామన్నారు. ఈఎంఐ సౌకర్యంతో పాటు గంటలోనే ఏ మొబైల్ నైనా ప్రస్తుతం యువతకు తగ్గట్టు మొబైల్స్ ను మార్కెట్లోకి తీసుకు రావడం జరిగింది అన్నారు. మొబైల్స్ ఎలక్ట్రానిక్స్ సేల్స్ లో ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్ సష్టిస్తూ బెస్ట్ రిటైల్ చైన్ గా నిలుస్తున్న సంస్థ హ్యాపీ మొబైల్స్ అని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలే కాకుండా జిల్లా ప్రజలు ప్రధానంగా యువత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ షోరూం ప్రతినిధులు పాల్గొన్నారు.. మరిన్ని ఆఫర్ల కోసం 9100412345 సెల్ నెంబర్ ను సంప్రదించవచ్చని కోరారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

సరస్వతి శిశు మందిరంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వామి ప్రణవాత్మానంద సరస్వతి పాల్గొన్నారు. పాఠశాలలో గణపతి హోమం, పూజ నిర్వహించారు. విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు. అనంతరం ప్రణవాత్మానంద సరస్వతి మాట్లాడుతూ అక్షరాభ్యాసం విశిష్టతను, అక్షరాభ్యాసానికి వచ్చిన తల్లిదండ్రులకు కుటుంబం బాధ్యత ఎలా నిర్వహించాలో తల్లి బాధ్యతను మార్గ నిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు మల్లెమాల మురళీ రెడ్డి మురళీకృష్ణ, రాపూరు రవి చంద్రారెడ్డి, చల్ల చంద్రశేఖర్ రెడ్డి, నరసింహస్వామి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షులు మల్లెమాల మురళీ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆర్‌.రావు, కార్యదర్శి మురళీ కృష్ణ, సహకార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రామ్మోహన్ పాఠశాల సహకార్యదర్శి మధురి శ్యామ్ యాదవ్, సభ్యులు రవి చంద్రారెడ్డి, సనత్ రెడ్డి, లలిత, దయాకర్ పాల్గొన్నారు.

జగనన్న ఆంధ్రాకి మళ్లీ: వైసిపి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా సోదరుడు, వైసిపి నాయకులు రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రజల కోసం సంక్షేమం, అభివృద్ధిని అమలు చేస్తున్న జగనన్న ఆంధ్రకు మళ్లీ కావాలి అని మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. 'ఎందుకు ఏపీకి జగన్ కావాలి?' పై పుత్తూరు, వడమాలపేట మండలాల సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎందుకు ఏపీకి జగన్ కావాలి? కార్యక్రమం కింద ప్రతి రోజు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డ్ ఆవిష్కరణ, ప్రతి ఇంటికి జెండా ఎగురవేయడం, ఊరి, గ్రామ పెద్దలతో డిన్నర్ రాత్రి బస చేయడం, ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి? అనే అంశంపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఎందుకు ఏపీకి జగన్ కావాలి" కార్యక్రమం మండల పార్టీ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ, వార్డు వాలంటీర్లు, పార్టీ మద్దతుదారులు, లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. టిడిపి నిర్వహిస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పుత్తూరు, వడమాలపేట మండలాల మండల, సచివాలయం కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ప్రత్యేక డైరెక్టర్లు, మండల పార్టీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ ను వెంటనే ఆపాలి

- కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అక్రమంగా జరుగుతున్న మైనింగ్‌ను ఆపాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. అక్రమంగా సాగిస్తున్న మైనింగ్‌ను అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వెంటనే ఆపాలని పేర్కొన్నారు.

కొంత మంది దోపిడీ

మాఫియాగా ఏర్పడి సహజ వనరులను దోచుకొని కోట్ల రూపాయలను సంపాదిస్తున్నారన్నారు. అటవీ భూములు, పేదల భూములను సైతం ఆక్రమించుకొని, అడిగిన వారి పై ప్రజా ప్రతినిధుల అండతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఇకనైనా మైనింగ్ పై జిల్లా అధికారులు విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలన్నారు. ఈయన వెంట గూడూరు మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ దుంపల నాగరాజు వెంకటయ్య, అధ్యక్షులు పవన్ కుమార్, నాగూర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి

మాట్లాడుతున్న ఎంపిడివో నరసింహారావు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రజలందరిచే ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఐఎస్ జివో డిఎం నరసింహారావు బుచ్చినాయుడు కండ్రిగ సచివాలయం, సర్పంచ్, వాలంటీర్ల చే ఆరోగ్యశ్రీ యాప్ గౌన్‌లోడ్ చేయిస్తున్నారని, ప్రజలందరికీ మరోమారు తెలిపి ఈ కార్యక్రమం లబ్ధిదారులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు ఆరోగ్య శ్రీ యాప్ అనిలో లాగిన్ విధానం ద్వారా అరోగ్యశ్రీని సద్వినియోగంచేసుకోవాలన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న ఎంపిడివో రఘురామయ్య

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ప్రతి రోగికీ ఉచిత ఆరోగ్య సేవలు అందించి ఆరోగ్యవంతులుగా చేయ డమే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమని దొరవారిసత్రం ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామయ్య అన్నా రు. శుక్రవారం పోలిరెడ్డి పాలెం సచివాలయంలో వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్ర మానికి హాజరైన ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్య స్థితిని బట్టి వైద్య సేవలు పొందాలని సూచించారు. శిబిరంలో ఐదుగురు వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందించారు. బిపి షుగర్, కంటి సంబంధ లోపాలు ఉన్న రోగులు వైద్య సేవలు పొందారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అంగన్ వాడీ కార్యకర్తలు పలు రకాల సమతుల్య ఆహార పదార్థాలను స్టాల్స్ లో ప్రదర్శించారు. గుండె చప్పుడు తేడాలు ఉన్న ఆరుగురు రోగులకు ఈసీజీ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొగరాముడి వైద్యాధికారి తరుణ్ సాయికుమార్, దొరవారిసత్రం వైద్యులు చైతన్య, పళని రాజ్, ప్రత్యేక వైద్యులు అఖిల, యామిని కృష్ణ, హెల్త్ సూపరువైజర్స్ జనార్ధన్, పిహెచ్ఎన్ వరలక్ష్మి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, సెక్రటరీ మునికృష్ణ, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్లు దొరవారిసత్రం తొగరాముడి ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తరించాలనుకునే గాయకులకు అద్భుత అవకాశం

ప్రజాశక్తి-తిరుపతి: దాస సాహిత్య ప్రాజెక్టు తరపున తిరుమల శ్రీవారి ఆలయం, తిరుపతి శ్రీ గోవింద రాజస్వామి ఆలయంలో నిర్వహించే ఊంజలసేవలో భక్తి గీతాలు ఆలపించడానికి ఔత్సాహిక గాయనీ, గాయకులను ఎంపిక చేయనున్నారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆసక్తి ఉన్న గాయనీ, గాయకులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్: హెచ్‌టిపిపి//ఎపిపిఎస్.తిరుమల ఒఆర్‌జి/ డిఎస్‌పిద్వారా ఆన్‌లైనులో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఆఫ్ లైన్, లేదా ఇతర మాధ్యమాల ద్వారా పంపే దరఖాస్తులు అంగీకరించరు. కళాకారులు అక్టోబర్ 21వ తేదీ నుండి నవంబర్ 14వ తేదీ లోపు ఆన్లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న గాయనీ, గాయకులకు నవంబరు 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఎంపిక పరీక్షలు నిర్వహిస్తారు. ఎంపికలో పారదర్శకత పాటించడం కోసం ఎస్వీబీసీ ద్వారా ఈ కార్యక్రమాన్ని చిత్రీకరిస్తారు. దరఖాస్తు చేసుకున్న గాయనీ గాయకులు వారికి కేటాయించిన సమయానికి హాజరు కావాలని కోరారు. ఈ ప్రక్రియకు సంబంధించి టీటీడీ ఎలాంటి ఏజెంట్లు, ప్రతినిధులను నియమించలేదనీ, మోసగాళ్లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. మరిన్ని వివరాలకు టీటీడీ అధికారిక వెబ్ సైట్ ను సంప్రదించాలని ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ ఆనంద తీర్థ చార్యులు తెలిపారు.

కాటూరు చెరువు తూము సమస్యకు పరిష్కారం

స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యే

కాటూరు చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బియన్ కండ్రిగ మండలం కాటూరు చెరువు తూము విషయమై స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం, తిరుపతి జిల్లా పార్లమెంట్ సభ్యులు డా యం గురుమూర్తినీ కలిసి స్థానిక యంపిటిసి రవి, గ్రామ ప్రజలు ఫిర్యాదు చేయగా వారు ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ డిఇ, ఇఇ అధికారులను పంపి పరిష్కారం చేశారు. స్థానిక ప్రజలు, ఎంపిటిసికి, స్థానిక ఎమ్మెల్యేకి, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

పుష్పపల్లకిపై గోవర్ధనుడుగా మలయప్ప

పుష్పపల్లకిపై గోవర్ధనుడి ఆకారంలో ఊరేగుతున్న శ్రీవారు

ప్రజాశక్తి -తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గోవర్ధనగిరిధారి అయిన దక్షిణ సత్యభామ సమేత శ్రీకృష్ణుని అలంకారంలో మలయప్ప స్వామి పుష్పక విమానంలో దర్శనమిచ్చారు. పుష్పక విమాన సేవను మూడు సంవత్సరాలకు ఒకసారి అధిక మాసం సందర్భంగా నిర్వహించే నవరాత్రి బ్రహ్మోత్సవాలలో నిర్వహిస్తారు. వాహన సేవల్లో అలసిపోయే స్వామి, అమ్మవార్ల సేద తీరడానికి పుష్పక విమానంలో వేంచేపు చేస్తారు. ఈ ప్రత్యేకమైన పుష్పక విమానాన్ని కొబ్బరి చెట్ల ఆకులతో తయారు చేశారు. ఇది 27 అడుగుల ఎత్తు, 15 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పుతో దాదాపు ఒక టన్ను బరువు ఉంటుంది. ఇందులో 6 రకాల సంప్రదాయ పుష్పాలు ఉపయోగించారు. శ్రీవారి పుష్పక విమానాన్ని మూడు దశలలో ఏర్పాటు చేశారు. విమానంకు ఇరువైపులా ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, మొదటి దశలో అష్టలక్ష్ములు, రెండవ దశలో సహకారులు కూడిన అష్టనాగులు, మూడవ దశలో రిథమా మాల, గోపురంతో రూపొందించారు. తమిళనాడు లోని సేలానికి చెందిన 20 మంది, టీటీడీ గార్డెన్ విభాగానికి చెందిన 10 మంది వారం రోజుల పాటు శ్రమించి ఈ అద్భుతమైన విమానాన్ని సిద్ధం చేశారని టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. చెన్నైకి చెందిన దాత రాంప్రసాద్ భట్ శ్రీవారి పుష్పక విమానాన్ని ఆకర్షణీయంగా రూపొందించి చేయడం సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్, ఈవో, పలువురు బోర్డు సభ్యులు, జెఈవోలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఎస్‌వి మ్యూజియం

-7డి టెక్నాలజీ వినియోగం- అధికారి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలోని ఎస్వీ మ్యూజియం అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమవుతోందని మ్యూజియం అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. తిరుమల రాంభగీచా–2లోని మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ టిసిఎస్ సంస్థ రూ.125 కోట్లు, బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ రూ.20 కోట్లు కలిపి మొత్తం రూ.145 కోట్ల విరాళంతో నూతన హంగులతో మ్యూజియం రూపుదిద్దు కుంటోందన్నారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీ వినియోగించి 17, 3 డి హంగులతో టిసిఎస్ 14, మ్యాప్ సిస్టమ్స్ 5 కలిపి మొత్తం 19 గ్యాలరీలతో ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్ లో తిరువీధులు, తిరుమల ఆలయ అనుభూతి, వాహన సేవలు, స్వామివారి సేవలు, సప్తగిరుల గ్యాలరీలు ఉన్నాయని, వీటిని బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ వారు అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. మిగతా గ్యాలరీలను టీసీఎస్ సంస్థవారు ఆధునీకరిస్తున్నారని చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్ లో వేంకటేశ్వరుడు, రాతి విగ్రహాలు, కాంస్య విగ్రహాలు, దారు విగ్రహాలు, అన్న మయ్య రాగి రేకులు, పురాతన నాణేల గ్యాలరీలు ఉన్నాయన్నారు. మొదటి ఫ్లోర్ లో శ్రీవారి ఆలయ శిల్పకళా వైభవం, భక్తులు– వారి సేవలు, యుద్ధ పరికరాలు, సంగీత వాయిద్యాలు, పూజా సామగ్రి గ్యాలరీలు వంటి అనేక అద్భుతాలు కొలువుతీరి భక్తులకు అబ్బురపరిచేలా ఉన్నాయని చెప్పారు. రెండవ ఫ్లోర్ విరాట్ పురుషుడు బ్రహ్మ మహేశ్వరులు, రుగ్వేదం, యజుర్వేదం గ్యాలరీలు ఉన్నాయన్నారు. మూడో ఫ్లోర్ బ్రహ్మాండ గ్యాలరీ కొలువై ఉందని, మ్యూజియం పైభాగంలో 17 పెద్ద గోపురాలు ఉన్నాయని చెప్పారు. వీటిలో తాళ్లపాక అన్నమయ్య, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, పురందరదాసు, రామానుజాచార్యులు, శంకరాచార్యులు, మధ్వాచార్యులు వంటి భక్తులతోపాటు రామాయణ, మహాభారతం, భగవద్గీత లాంటి మహాగ్రంథాలకు సంబంధించిన ఆసక్తికరమైన అంశాలను ప్రదర్శించినట్టు తెలిపారు. భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ మ్యూజియం అభివృద్ధి పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కానున్నాయని చెప్పారు. మీడియా సమావేశంలో టీటీడీ పీఆర్వో డా. టి.రవి, ఏపీఆర్వో కుమారి పి.నీలిమ, మ్యూజియం క్యూరేటర్ శివకుమార్ పాల్గొన్నారు.

చేయూత అభినందనీయం: మాజీ ఎమ్మెల్యే


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : తండ్రి జ్ఞాపకార్థం కుమారులు సేవా కార్యక్ర మాలు నిర్వహించడం అభినందనీయమని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు గూడూరు పట్టణానికి చెందిన టిఎం కేశవులు జ్ఞాపకార్థం వారి కుమారులు అశోక్ కుమార్, చంద్రా లు పట్టణంలోని ఓం శ్రీ సాయి రామ్ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రయంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ కేశవులు మిలటరీలో పని చేస్తూ వారి హక్కులను కాపాడేందుకు పోరాటాలు చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తి అని అతని కుమారులు తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ క్రమంలో పట్టణ పరిధిలో ఉన్న నిరాశ్రయ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో పార్లమెంట్ మహిళా కార్యదర్శి గుండాల భారతి, నియోజకవర్గ యువత అధికార ప్రతినిధి వేముల సునీల్, అల్లం వెంకటసాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తెలుగులో శాలినికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగపు పరిశోధక విద్యార్థిని పడవేటి శాలిని డాక్టరేట్ డిగ్రీని పరీక్షలు నియంత్రణ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఆమె విశ్రాంత ఆచార్యులు మూలె విజయలక్ష్మి మార్గదర్శకత్వంలో "కురబలకోట మండల జానపద గేయ సాహిత్యం" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. శాలిని పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అనేక పరిశోధన పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. పడవేటి శాలినికి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పెల్లేటి గోపాల్ రెడ్డి,సీనియర్ న్యాయవాది ఎల్.రామచంద్రరావు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఏకపక్షంగా తీసుకోన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ స్టాంప్ ఒక రూపాయి నుండి 20 రూపాయలు ఒకేసారి పెంచడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అదనంగా మోపబడిన 20 రూపాయల స్టాంపు, తద్వారా కలిగే ఇబ్బందులను కక్షిదారులకు వివరించి, ఇందుకు వారు తమ వంతు మద్దతును తెలుపుతూ న్యాయవాదులు కక్షిదారులు సమైక్యతతో ప్రభుత్వం జీవోను ఉపసంహరించుకొని తమకు అదనపు భారాన్ని తగ్గించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ పిలుపుమేరకు విధులు బహిష్కరించి నిరసనలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బాలప్రదీప్,సెక్రటరీ పీవీ.రమణయ్య,ఇతర న్యాయవాదులు సూర్య, సురేష్,అనురాధ,దాసరి అశోక్ కాంబ్లే పాల్గొన్నారు.

టిడిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని స్థానిక ఎస్ కే బి చికెన్ సెంటంలో స్థానిక టిడిపి నాయకులు కలిసి టీడీపీ ప్రభుత్వం అమలులోకి వచ్చేందుకు కృషి చేయాలని టిడిపి నాయకులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని అన్ని పంచాయితీల్లో రానున్న ఎన్నికలకు టిడిపి అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసే విధంగా ఉండాలనే దిశా నిర్దేశాన్ని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కోట టిడిపి మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమ రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్.జలీల్ అహ్మద్,మాజీ మండల ఉపాధ్యక్షులు కోకర్ల.మధు యాదవ్, సీనియర్ టిడిపి నాయకులు వాకా.విజయభాస్కర్ రెడ్డి,మారం రెడ్డి.శ్రీధర్ రెడ్డి,తదితర టిడిపి నాయకులు ఉన్నారు.

భువనేశ్వరికి ఎస్‌సివి మద్దతు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన సతీమణి నారా భువనేశ్వరిని రాజమండ్రిలో కొనసాగిస్తున్న నిరసన దీక్షకు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు శుక్రవారం మద్దతు తెలిపారు. బాబుతో మేము సైతం అంటూ గళం కలిపారు. ఎస్‌సివితోపాటు గోగినేని భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని శ్రీ బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమం, శక్తిపీఠంలో జరుగుతున్న దేవి శరన్న నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం శక్తిపీఠంలో ఏపీ పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, బ్రహ్మశ్రీ గురూజీ ఆశ్రమంలో ఉత్తర ప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి రఘు రాజ్ సింగ్, టిడిపి జిల్లా అధ్యక్షులు పులివర్తి నాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మంత్రులకు ఘన స్వాగతం పలికారు. బ్రహ్మశ్రీ గురుజి ఆశ్రమంలో ఉత్తరప్రదేశ్ మంత్రి రఘురాం సింగ్ శ్రీ కనక దుర్గాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తిపీఠంలో రాష్ట్ర పర్యాటక శాఖ మాత్యులు ఆర్కే రోజా శక్తిపీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీసుకున్నారు అనంతరం శ్రీ బ్రహ్మర్షి గురుజీ ఆశ్రమం పీఠాధిపతి బ్రహ్మర్షి గురుజీ మంత్రి రఘు రాజ్ సింగ్, టిడిపి జిల్లా అధ్యక్షులు పులివర్తి నాణీలకు ఆశీర్వాదం అందజేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, కె గిరిధర్ రెడ్డి, రామిరెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు రాజేష్, ప్రకాష్ శేటియా, బాబూలాల్, ఆశిష్మెహతా, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చాటూరు మండలం శివగిరి గ్రామ రెవిన్యూ కి చెందిన చెరువు పోరంబోకు కి చెందిన భూమిని ఎవరైనా కబ్జా చేస్తే వారిపై ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తప్పవని పిచ్చాటూరు మండలం తహశీల్దారు మధుసూదన్‌రావు హెచ్చరించి ఆ స్థలంలో ఆర్ఐ సుధాకర్, విఆర్ఓ రూపేష్ ద్వారా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ భూమికి సంబంధించిన వాటిని ఎవరైనా కబ్జా చేస్తే వారిపై కఠి చర్యలు వుంటాయని వాటిని రెవెన్యూ కార్యాలయంలో అర్జీ ద్వారా తెలపాలని ఆ భూమిని ప్రభుత్వం ద్వారా స్వాధీనం చేసుకుని ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలి

కలెక్టర్ కి వినతి

ప్రజాశక్తి - బాలాయపల్లి : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అక్రమంగా తెల్లరాయి మైనింగ్‌ను అడ్డుకోవాలని తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో గూడూరు చిల్లకూరు, కోట వాకాడు మండలంలో తెల్లరాయి అక్రమ జరుగుతున్నట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌లను వెంటనే నిలపాలన్నారు. ఇక అటవీ భూముల్లో అక్రమంగ తరలిస్తు తెల్లరాయి కోసం లోడుతున్న గుంతల వల్ల వన్యప్రాణులకు ప్రాణాపాయం ఉందన్నారు. ఇక అధిక లోడుతో వెళుతున్న వాహనాలను రోడ్డు రవాణా సంస్థ అధికారులు తనిఖీలు చేయడం లేదన్నారు. అనుమతులు ఒక చోట.. లోడుతున్న మరొక చోట అనివిమర్శించారు. ఇక తెల్ల రాయి ఎక్కడపడితే అక్కడ డంపింగ్ యార్డ్ నిర్వహిస్తూ ఒక్కో డంపింగ్ యార్డ్ కు లక్ష నుంచి ఒకటిన్నర లక్ష రూపాయలు లంచం గా తీసుకుంటూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆ డంపింగ్ యార్డ్ లన్నీ తీసేయాలని కోరారు.ఇక మైనింగ్ పర్మిషన్ ఇచ్చినప్పుడు ఆ ప్రాంతంలో వాళ్లకు మైనింగ్ చేసే ప్రాంతం లో ఉన్న స్థలం లేకపోయి నప్పుడు డంపింగ్ చేయడం అవసరం ఏముంది? ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్ర మంలో గూడూరు మండల కాంగ్రెస్ ప్రసిడెంట్ దుంపల నాగరాజు, వెంకటయ్య ,అధ్యక్షులు పవన్ కుమార్, నాగూర్ పాల్గొన్నారు.

ఏపీలో కాంగ్రెస్ సపోర్టు చేసే పార్టీకే అధికారం: మాజీ ఎంపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ కి వివిధ వర్గాల నుండి మద్దతు లభించిందని, కాంగ్రెస్‌కి సపోర్టు చేసే పార్టీ అధికారంలోకి వస్తుందని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశ ఎన్నడూ శాంతిని కోరుకునే దేశమని అలాంటి దేశానికి ప్రధానమంత్రిగా ఉన్న వ్యక్తి హింసను కలిగిస్తున్న దేశానికి మద్దతుగా మాట్లాడడం, పొగడడం సరికాదన్నారు. మానవ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గాజాలోని ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులపై బాంబు దాడి తీవ్ర అమానుష ఘటనగా చెప్పారు. నాలుగు రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికలలో కాంగ్రెస్ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా న్యాయ వ్యవస్థపై దేశ ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని, ముఖ్యంగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన రోజు నుండి న్యాయవ్యవస్థ పాలనకు రాజకీయ జోక్యం కలిసిం దన్నారు. దీంతో రాజకీయ ఒత్తిళ్లతో కేసుల్లో ఇరికిస్తున్నా రన్నారు. రాహుల్ గాంధీ కేసు కూడా ఇలానే జరిగిందన్నారు. దీనిపై న్యాయ వ్యవస్థ పెద్దలు స్పందించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, కాంగ్రెస్ అధికారంలోకొస్తే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుందని హామీ ఇచ్చారు.

వైసీపీ పాలనలో పేదలకు కష్టాలు: గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గత టిడిపి హయాంలో వస్తున్న పింఛన్లను ఈ వైసీపీ ప్రభుత్వం అనేక నిబంధనలు, రకరకాల కారణాలతో తొలగించి పేద ప్రజలను ఇబ్బందిపెడుతోందని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం రామసముద్రంలో ఆయన పర్యటించారు. ఇటీవల మరణించిన నరసింహులు మందడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏపడబ్ల్యూలో రామ్మూర్తి మరణించారు. వీరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన భర్తకు గతంలో టిడిపి హయాంలో ఎన్టీఆర్ భరోసా పింఛను రు.2 వేలు వచ్చేదని, ఈ వైసీపీ ప్రభుత్వం వచ్చాక తొలగించిందని, ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని రామ్మూర్తి భార్య ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ రు.200 పింఛను రూ.2 వేలు పెంచిన ఘనత చంద్రబాబు ది అని, నిబంధనలు పేరుతో లక్షల పింఛన్లు తొలగించి పేదల కడుపు కొట్టిన ఘనత జగన్ కే దక్కుతుందని విమర్శించారు. గతంలో ఇచ్చిన పింఛన్లు తొలగించి పేదలను ఇబ్బంది పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద కుటుంబాల కోసం నాడు చంద్రన్న బీమా ప్రవేశపెట్టి మృతులు ప్రతి ఒక్కరికీ తక్షణ సాయంగా మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందించడమే కాకుండా మృతి స్వభావంను బట్టి రూ.30 వేల నుండి రూ.5 లక్షల వరకు సాయం అందిస్తే నేడు బీమా సాయం కనుమరుగైందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, తడుకు సర్పంచ్ బొబ్బిలి, మహేష్, కోటేశ్వరరావు, సుబ్రమణ్యం నాయుడు, కైలాస నాయుడు, గజపతి, మోహన్ రాజు, మహేష్ పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై కోదండరాముడు

రాత్రి గజ వాహనంపై శ్రీవారు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు శుక్రవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి హనుమంత వాహనంపై కోదండరాముని అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల గోష్ఠితో స్వామివారి కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా నిర్వహించారు. విశేషంగా విచ్చేసిన భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగరాభివృద్ధికి కీలకమైన పన్నుల వసూళ్లు చేయాలని, తిరుపతి పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం పన్నుల వసూళ్లు, పారిశుధ్యం మెరుగు, సచివాలయాల పనితీరు, అభివృద్ధి పనులపై సచివాలయాల కార్యదర్శులు, మునిసిపల్ కార్పొరేషన్ అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. తిరుపతి నగరంలో వేయాల్సిన ఆస్తిపన్ను, నీటి పన్ను, అండర్ డ్రైనేజ్ పన్ను, చెత్తసేకరణ పన్ను, ఖాళీ స్థలాల పన్నులను సకాలంలో వసూళ్లు చేసి తిరుపతి నగరాభివృద్ధికి కృషి చేయాలన్నారు. తిరుపతి నగరంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ముఖ్యంగా చెత్తరహిత నగరంగా తిరుపతిని తీర్చిదిద్దాలన్నారు. ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్తను సేకరించి ప్లాంట్ కు తరలించాలన్నారు. నగరంలో రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించడం ద్వారా అలాంటి వారిని అరికట్టవచ్చని తెలిపారు. సీజనల్ వ్యాధులు, దోమలు పెరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు తెలిపే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి సచివాలయ కార్యదర్శులు అందరూ సమన్వయంతో కలిసి ప్రజాభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా పని చేయాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, రెవెన్యూ అధికారులు కేవల్ వర్మ, సేతు మాధవ్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్, నరేంద్ర, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్ వైజర్ చెంచెయ్య, సుమతి, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

మాట్లాడుతున్న ధర్మరాజుల స్వామి ఆలయకార్యనిర్వాహణ అధికారి నవీన్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 21, 22 తేదీన దసరా ఉత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లోని ధర్మరాజు స్వామి దేవస్థానంలో ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి నవీన్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ధర్మరాజు దేవస్థానంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గూడూరు ధర్మరాజుల స్వామి ఆలయ కార్యనిర్వాహణ అధికారి నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ భరతనాట్య నృత్యాలు, 22న జబర్దస్త్ టీం ఆధ్వర్యంలో సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పట్టణ ప్రజలు, భక్తులు సాంస్కృతి కార్యక్రమాలు తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి చైర్మన్ బొమ్మిడి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఈ చలానా రద్దు చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆటో కార్మికులకు ఈ చలానా రద్దు చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ గురుస్వామి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు డి మహేష్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో వున్న పోలీసు ఈ చలానాలు రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. భారీగా పెనాల్టీలు పెంచే 21, 31 జీవోలు రద్దు చేయాలని, పెట్రోల్ డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 501కి తగ్గించాలని, నియోజకవర్గాల్లో మండలాల్లో పంచాయతీ కార్పొరేషన్ లో ప్రతి మండలాల్లో ఆటో స్టాండ్ స్థలం కేటాయించాలని, లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవరుకు వాహన మిత్ర ద్వారా10 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రైవేటు ఫైనాన్సర్ల ఆగడాలు అరికట్టాలని, లైసెన్స్ కలిగి అర్హత ఉన్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వమే జాతీయ బ్యాంకుల ద్వారా కొత్త ఆటోలుకు రుణాలు మంజూరు చేయాలని, ఆటో రంగాన్ని నిరుద్యోగ పారిశ్రామిక రంగంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్ కైలాసం, కార్యదర్శి కోదండపాణి పాల్గొన్నారు.

చెల్లూరులో తాగునీటి సమస్య

ప్రజాశక్తి-పర్వేడు: మండలంలోని చెల్లూరులో గత ఐదు రోజులుగా తాగునీరు లేక గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ట్యాంకర్ల రూపంలో బయట నుంచి తెప్పించుకుంటున్నారు. ఈ సమస్యను వెంటనే అధికారులు గుర్తించి పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF MACT - II AT THIRUVALLUR (SUB-COURT LEVEL)
M.C.O.P. NO. 82 / 2023

Mr.J. Rajkumar ....Petitioner

Vs

1. Prasanthi Tatikonda
2. The Manager
National Insurance Co Ltd. ....Respondents

To
R1. Mr. Prasanthi Tatikonda,
D/o T. Malakondaiah, No.20-1-416/18/C10,
Subash Nagar, Korlagunta, Thirupathi Urban,
Thirupathi District, Andhra Pradesh,
Pin code - 517501

PUBLIC NOTICE

This is to inform you that the above petitioner is filed original petition against to you for grant of compensation for the grievous injuries sustained by his in road accident which occurred on 16.12.2022 at about 06.30 AM at Kanakamma Chathiram by pass road. In this regard, the Hon'ble MACT-II at Thiruvallur, was pleased to order public notice to you in M.C.O.P.No. 82/2023 returnable by 07.11.2023.

Hence you are requested to appear either in person or through your counsel on 07-11-2023 at 10.30, before the Hon'ble MACT-II, at Thiruvallur, to put forth your objections if any on that day, failing which the matter will be decided in your absence.

R. Ramesh, B.A., B.L.,
Counsel for Petitioner.
Cell : 9751166982, 9445117228.

బోనుపల్లిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని బోనపల్లి వైఎస్సార్ యానాది కాలనీలో శుక్రవారం తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ వాసులు సీజనల్ వ్యాధులకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్య శిబిరంతోపాటు, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య సలహాలు అందజేశారు. వైద్యాధికారి లహరిని, ఎస్‌ఓ శివకుమార్, సూపర్వైజర్ నాగేంద్రబాబు, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశా వర్కర్లు జయంతి, కృష్ణమ్మ పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE: KADAPA
Insolvency Petition No. 34 of 2019.

Between:
Panakanapalli Rama Krishna Reddy, son of P.Valasi Reddy, Hindu, aged about 60 years, business, residing in D.No.62/19, Marathi street, Hamlet of Akkayapalli, Kadapa City and District. **...Petitioner.**

And

R.32 Kalagotla Peeraiah, Son of K. Subbaiah, aged about 58 years, Hindu, Forest Range Officer, working at Alipiri Zoo Park Tirupati, Chittoor District. **...Respondent No. 32**

NOTICE TO RESPONDENT No 32

Please take notice that the petitioner have filed the above I.P. is filed against you for losses in the businesses, the respondent are trying to detain the petitioner, for repayment of the amounts borrowed from them and the case stands posted for your appearance either personally or through an advocate, at 10.30 A.M. on **30.11.2023** before the said court and if you fail to appear, matter will be decided exparte.

//By Order of the Honourable Court//
M.SURESH KUMAR, M.A.,B.L.,
Advocate, Kadapa.
Cell: 9440673990.